## క్లుప్తంగా

### ఆదమరిస్తే ఆపదే..



పొన్నూరు: పట్టణం నుంచి ఇటికంపాడుకు వెళ్లే ప్రధాన రహదారి వాహనాలు, ప్రజల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఆ మార్గంలోని మసీదు వద్ద డ్రెయిన్‌పై ఉన్న గుంత ప్రమాదాలకు నెలవుగా మారింది. అక్కడ పెద్ద గొయ్యిలా ఏర్పడి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తరచూ వాహనాలు పడిపోయి ప్రమాదాలు జరిగి పలువురు గాయాల పాలయ్యారు. అయినా కనీస మరమ్మతులు చేయించేందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

### పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



రేటూరు(కాకుమాను): గర్భిణి సమయంలో మంచి పోషక విలువలు కలిగిన పోషకాహారం తీసుకోవడం ద్వారానే తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్ వైజర్ వెంకాయమ్మ అన్నారు. మండలంలోని రేటూరు బీసీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పోషకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వెంకాయమ్మ మాట్లాడుతూ గర్భిణి సమయంలో తప్పని సరిగా మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని అప్పుడే ఆరోగ్య కారమైన శిశువుకి జన్మనియ్యడంతో పాటు తల్లీ,శిశువు సంపూర్ణ ఆరోగ్యం ఉంటారని సూచించారు. ఆకు కూరలు, మొలకలు, పాలు, కోడిగుడ్లు అధికంగా తీసుకోవాలని కోరారు. ఈసందర్భంగా తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు ఉన్న ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవాలో వివరించారు.

### వరి, పత్తి పంటల క్షేత్రస్థాయి పరిశీలన

గుంటూరు రూరల్: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు మండలంలోని జొన్నలగడ్డలో పంటల క్షేత్రస్థాయి పరిశీలన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఎం.నగేష్, సేద్య విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.వెంకట లక్ష్మి వరి, పత్తి పంటలను పరిశీలించారు. వరిలో ఆకుముడతను గుర్తించారు. ఆకుముడత నివారణకు ట్రైకోగమను పిచికారి చేయాలని సూచించారు. రైతు నవీన్‌రెడ్డి వరి పొలంలో పంటను నష్టపరిచే పురుగుల గ్రుడ్లు తినే పరాన్న జీవులను విడుదల చేశారు. పత్తి పంటలో గులాబిరంగు పురుగుల నివారణకు ప్రథమ శ్రేణి పంటల ప్రదర్శనలో భాగంగా రైతు కోటిరెడ్డి పొలంలో ఎకరానికి 10 చొప్పున లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేశారు.

### వినాయకుని గ్రామోత్సవంలో వివాదం

పెదకాకాని: వినాయకుని గ్రామోత్సవంలో చోటుచేసుకున్న వివాదంలో వైఎస్సార్ సీపీ వర్గీయులపై కేసు నమోదు అయింది. వివరాలు.. పెదకాకాని మండలం అనుమర్లపూడి గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు గ్రామంలో వినాయక చవితి పురస్కరించుకుని విఘ్నేశ్వరుని విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. గురువారం నిమజ్జన కార్యక్రమంలో భాగంగా గ్రామోత్సవం ఏర్పాటు చేశారు. ఈ గ్రామోత్సవం రాత్రి పది గంటల సమయంలో పంచాయతీ కార్యాలయం మీదుగా వెళుతున్న క్రమంలో గ్రామోత్సంలో ఉన్నవారిపై రాళ్లు విసిరారు. ఈ దాడిలో ఐదుగురికి గాయాలు కాగా వారిలో రేఖా సాంబశివరావు తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు రేఖా సాంబశివరావు ఫిర్యాదు మేరకు వైఎస్సార్ సీపీకి చెందిన దానబోయిన మణికంఠ, నాగేశ్వరరావు, గంగాధరరావు, నాగరాజు, ఆరాధ్యుల ఫణీంద్రలతో పాటు మరికొంత మంది పై కేసు నమోదు చేసినట్లు శుక్రవారం రాత్రి పోలీసులు తెలిపారు.

### మహిళ మెడలో గొలుసు చోరీ

పట్నంబజారు: మహిళ మెడలో నుంచి గొలుసు లాక్కొని వెళ్లిన ఘటనపై కేసు నమోదైంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. విద్యానగర్ 1వలైనుకు చెందిన సి.హెచ్.అనంతలక్ష్మి ఈనెల 12వ తేదీ రాత్రి అదే ప్రాంతంలో 3వలైనులో ఉన్న సాయిబాబా గుడికి వెళ్లి వేరే మహిళతో కలసి తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈక్రమంలో ఎదురుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని గొలుసు లాక్కొని పరారయ్యాడు. సుమారు 30 గ్రాముల గొలుసు అపహరించుకు పోయాడని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### మణిపూర్ సంక్షోభంపై చర్చ

లక్ష్మీపురం: మణిపూర్ సంక్షోభంపై స్థానిక అవగాహన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ ఇంజినీర్, విశ్లేషకులు ఎన్.సదాశివం ప్రసంగించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, విశ్రాంత అధికారి పి.భావన్నారాయణ పాల్గొన్నారు.

# పంటనష్టం అంచనాలలో 'పచ్చ'పాతం

- అధికారులపై టీడీపీ నేతల ఒత్తిడి
- పూర్తిగా పంట నష్టపోయినా నిరాకరణే



చేబ్రోలు మండలం శలపాడులో వరదలకు మునిగిపోయిన పంట పొలాలు (ఫైల్)

చేబ్రోలు: భారీ వర్షాల కారణంగా పంట దెబ్బతిని, నష్టపోయిన రైతులను గుర్తించటంలో అధికారుల 'పచ్చ'పాతంపై చేబ్రోలు మండలంలోని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వీరనాయకునిపాలెం, శేకూరు, సుద్దపల్లి, వేజండ్ల, నారాకోడూరు, మంచాల, శ్రీరంగపురం తదితర గ్రామాల్లో వరి, కూరగాయ పంటలు భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. కొన్ని గ్రామాల్లో వారం రోజులకు పైగా వరద నీరు నిలిచి ఉండటంతో పంటలు నీటి మునిగి పూర్తిగా నష్టపోయారు. ప్రభుత్వం పంట నష్టం అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించింది. వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీ అధికారులతో బృందాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పంట నష్టం అంచనాలు తయారు చేయాలని సూచించింది. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో క్షేత్ర స్థాయి బృందాలకు తలనొప్పిగా మారింది. గ్రామాల్లో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు, తమకు అనుకూలంగా లేని వారికి చెందిన పంట పొలాలు దెబ్బతిన్నప్పటికీ జాబితాలో రాయకూడదని ఆదేశిస్తున్నారు. ఆయా గ్రామాల్లోని రైతులు స్థానిక టీడీపీ నాయకుల ఆశీస్సుల కోసం వారిని ప్రసన్నం చేసుకోవాలసిన పరిస్థితిని తీసుకొచ్చారు.

**ఉన్నతాధికారులకు ఫిర్యాదు..**

చేబ్రోలు మండలంలోని వీరనాయకునిపాలెం, శలపాడు, సుద్దపల్లి గ్రామాల్లో జరుగుతున్న పంట నష్ట పరిహారం అంచనాల తయారీలో జరుగుతున్న అవకతవకలపై స్థానిక రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. మండల స్థాయి అధికారులు రైతుల ఫిర్యాదులను తీసుకోవటానికి నిరాకరించినట్లు రైతులు చెబుతున్నారు.

వీరనాయకునిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ సర్పంచి భర్త యర్రాకుల వీరాంజనేయరాజు గ్రామంలో 15 ఎకరాల్లో కౌలు భూమిలో వరి సాగు చేస్తున్నాడు. రెండు నెలలుగా సాగు చేపట్టి వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టాడు. భారీ వర్షాలు, ఎగువ నుంచి వచ్చిన వరదలకు పొలంలో సుమారు మూడు అడుగుల మేర వరద నీరు చేరి మునిగిపోయింది. వారం రోజుల పాటు నీరు నిలిచిపోయింది. ఎకరం రూ.30 వేలకు కౌలుకు తీసుకొని ఎకరానికి రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. రూ.6.75 లక్షలు పెట్టుబడి పెట్టిన రైతుకు తీవ్ర నష్టం జరిగింది. స్థానిక టీడీపీ నాయకుల వత్తిడి మేరకు గ్రామానికి చెందిన సుమారు 70 మందికి చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరులకు చెందిన పేర్లు రాయటానికి నిరాకరించినట్లు తెలిసింది. ప్రభుత్వం అందించే పంట సాయంలో రాజకీయాలకు తావులేకుండా నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం చెల్లించే విధంగా అధికారుల బృందం దృష్టిపెట్టాలని రైతులు కోరుతున్నారు. లేకుంటే నష్టపోతామని వాపోతున్నారు.

# జాతీయ విపత్తుగా ప్రకటించాలి



పొలాలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

పెదకాకాని: వరదలు అధిక వర్షాల నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి నిధులు మంజూరు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి జొన్న శివశంకర్ డిమాండ్ చేశారు. మండలంలోని నంబూరులో పంట దెబ్బతిన్న వరి పొలాలను శుక్రవారం రైతు, కౌలు రైతులతో కలసి పరిశీలించారు. అనంతరం రైతుల సమస్యలు పరిష్కరించాలని సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సదర్భంగా జొన్న శివశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం వరదలకు నష్టపోయిన రైతులకు, కౌలు రైతులకు పంట రుణాలు పూర్తిగా మాఫీ చేయాలని కోరారు. రైతులకు తిరిగి మరల రుణాలు ఇవ్వాలని, ఉచిత విత్తనాలు, సబ్సిడీ మీద ఎరువులు, పురుగుమందులు అందజేయాలని సూచించారు. గండ్లు పడిన కాలువలకు వెంటనే గండ్లు పూడ్చి, తోటికాడ, గుర్రపు డెక్క తొలగించాలని కోరారు. అలానే వ్యవసాయ పంపు సెట్లకు ఉచిత కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు, బి.సాంబి రెడ్డి, ఎ సాంబిరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెలు, మేకల పెంపకంతో అదనపు ఆదాయం



మాట్లాడుతున్న డాక్టర్ వీపీఎస్ రాంబాబు

గుంటూరు రూరల్: ప్రతి రైతు పంటల సాగుతో పాటు కొన్ని పశువులు, కోళ్లు, మేకలు, గొర్రెలు వంటి వాటిని పోషిస్తూ పంటలతో పాటు అదనపు ఆదాయం సాధించేవారని ప్రముఖ పశువైద్య నిపుణుడు డాక్టర్ వీపీఎస్ రాంబాబు తెలిపారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలో రైతునేస్తం ఫౌండేషన్‌లో పశువుల పెంపకం అదనపు ఆదాయం, సేంద్రియ వ్యవసాయంపై రైతు శిక్షణ తరగతులు శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానురాను వివిధ రకాల కారణాల వల్ల రైతులు తమ పూర్తి సమయాన్ని ఒక్క పంటల సాగుకు మాత్రమే కేటాయిస్తూ అనుబంధ రంగాలను అశ్రద్ధ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ పరిణామాల వల్ల రైతులకు అదనపు ఆదాయ వనరులు లేకుండా పోయి ప్రతికూల పరిస్థితులలో రైతులు నష్టాలను చవిచూడాల్సి వస్తుందని చెప్పారు.

దీనికి పరిష్కారంగా రైతులు తిరిగి పంటల సాగుతోపాటు పశుపోషణ చేపట్టి కోళ్లు, మేకలు, గొర్రెలు పెంపకాన్ని కూడా చేపట్టాలని సూచించారు. అన్ని మెలకువలు పాటించి గొర్రెలు మేకల పెంపకం చేపట్టినట్లయితే రైతులకు అదనపు ఆదాయం వస్తుందని ఈ రోజు నాబార్డు సహకారంతో రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేంద్రియ సాగు విధానం, కషాయాలు, మిశ్రమాల తయారీతో పాటు రైతులు పండించిన వ్యవసాయ దిగుబడులకు విలువ జోడిపు వంటి అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించటం అభినందించదగిన విషయమన్నారు. రిటైర్డ్ వ్యవసాయ శాఖ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె రామచంద్రం మాట్లాడారు. కార్యక్రమంలో రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# పెదకాకానిలో ఉచిత వైద్య శిబిరం అభినందనీయం



పెదకాకానిలో వైద్యశిబిరానికి హాజరైన ప్రజలు

పెదకాకాని: సుందరయ్య కాలనీలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించడం అభినందనీయమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. పెదకాకాని సుందరయ్య కాలనీలో శుక్రవారం రాజరాజేశ్వరి మెమోరియల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇటీవల వరదలు అధిక వర్షాలు కారణంగా కాలనీ ముంపు గురై ప్రజలు పునరావాస కేంద్రాలకు చేరిన సంగతి తెలిసిందే. వైద్య శిబిరం ఏర్పాటు సందర్భంగా సుందరయ్య కాలనీలో శివాజీ మాట్లాడుతూ కాలనీలోని ప్రజలందరూ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు, కాలనీలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసిన ఆస్పత్రి నిర్వాహకులను అభినందించారు. డాక్టర్ ఎస్.హనుమంతరావు, డాక్టర్ కె.రామలింగేశ్వరరావు, డాక్టర్ బి.మనోజ్ కుమార్, సిబ్బంది ఎం.మదన్‌మోహన్, ఎస్.సౌమ్య, సిహెచ్.అయ్యప్ప, డి.నాగేశ్వరరావు, వై.లక్ష్మి, జి.పద్మ, ఎం.హైమావతి, బి.చక్రవర్తి, జె.సుబోధి, ఎం. రాహేలు, ఎం.శివ, కల్యాణి సేవలు అందించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు బురదగుంట సాంబయ్య, ఉల్లంగుల శివయ్య పాల్గొన్నారు.

### నేడు జాతీయ లోక్ అదాలత్

పొన్నూరు: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించనున్నట్లు సంస్థ చైర్‌పర్సన్, సివిల్ జడ్జి ఎం.అంజనీ ప్రియదర్శిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టులో నిర్వహించనున్న కార్యక్రమంలో కోర్టు పరిధిలోని కక్షిదారులు రాజీపడే క్రిమినల్, సివిల్, చెక్‌బౌన్స్, కుటుంబ తగాదాలు, బ్యాంకు కేసులు, రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పొన్నూరు: పట్టణం, మండల పరిధిలో 11 కేవీ విద్యుత్ వైర్లకు మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ ఎం.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాకుమాను: స్థానిక సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సాయి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### విద్యార్థులు లక్ష్య సాధన దిశగా కృషి చేయాలి

గుంటూరు రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో లక్ష్యసాధన దిశగా కృషి చేసి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య ఆకాంక్షించారు. శుక్రవారం గోరంట్లలోని కళాశాలలో నూతనంగా వివిధ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు విద్యార్థి ప్రేరణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్.షారోన్‌రోజ్ పాల్గొన్నారు.

# ఆర్‌వీఆర్‌జేసీలో ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి లీలావతి, ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు రూరల్: ఉజ్వల భవిష్యత్‌కు విద్యార్థి దశ కీలకమని జిల్లా న్యాయసేవ అధికారి సంస్థ కార్యదర్శి, గుంటూరు డివిజన్ సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి, ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఇల్ ఎఫెక్ట్ ఆఫ్ ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జడ్జి లీలావతి మాట్లాడుతూ జీవితంలో కళాశాల విద్యాభ్యాసం రోజులు మధుర జ్ఞాపకాలను నింపే విధంగా ఉండాలని సూచించారు. చట్టాలపై సమాజంలో ప్రతి ఒక్కరికి అవగాహనను విద్యార్థులు కల్పించాలని చెప్పారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేయకుండా తాము ఎంచుకున్న కోర్సులలో నైపుణ్యవృద్ధి దిశగా రాణించాలన్నారు. సాంకేతిక మాధ్యమాల ద్వారా ప్రతి ఘటన త్వరితగతిన అందరికి చేరుతున్న సమయంలో ఎంతో జాగ్రత్తగా మెలగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని, కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం.. వినియోగదారులకు భారం

పెదకాకాని: విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వినియోగదారులు బిల్లులు చెల్లించడం భారంగా మారింది. అసలే పెరిగిన విద్యుత్ రేట్లతో అల్లాడుతున్న వినియోగదారులకు నిర్లక్ష్యపు విద్యుత్ బిల్లులు మరింత భారంగా మారాయి. విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంతో నిర్దేశించిన సమయానికి బిల్లుల రీడింగ్ తీయకుండా ఆలస్యంగా రీడింగ్ తీయటం వలన అధికంగా యూనిట్‌లు పెరగడం, తద్వారా స్లాబ్ రెట్లు పెరిగి అధిక చార్జీలు చెల్లించ వలసి వస్తుందని వినియోగదారులు వాపోతున్నారు. పెదకాకాని గ్రామంలో ప్రతి నెలా 1, 2 తేదీలలో కరెంటు బిల్లులు ఇచ్చే సిబ్బంది ఈనెల 10 రోజులు ఆలస్యంగా కరెంటు రీడింగ్ తీసి బిల్లులు చేతికి ఇస్తున్నారు. గ్రామంలోని సదాశివకాలనీలో గత నెల 800 రూపాయలు బిల్లు చెల్లిస్తే, ఈనెల 1816 రూపాయల బిల్లు చేతికి ఇచ్చారు. దీనిపై సిబ్బందిని వినియోగదారులు ప్రశ్నించగా మాకు మీటర్ రీడింగ్ తీసి బిల్లులు ఇచ్చే మిషన్ ఇచ్చింది ఇప్పుడే, మాకు ఎప్పుడు ఇస్తే అప్పుడే వస్తామని బాధ్యతారాహిత్యంగా సమాధానం చెబుతున్నారని వినియోగదారులు పేర్కొంటున్నారు.

# అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు



అధికారులతో సమావేశమైన కమిషనర్

నెహ్రూనగర్: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని గుంటూరు నగరంలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో గుంటూరు నగరంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమ అమలుపై విభాగాధిపతులు, ఇతర అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో విజయవంతం చేయడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కోరారు. ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన కలిగించడం, ప్రోత్సహించడం జరుగుతుందని చెప్పారు. వార్డు సచివాలయాల వారీగా సామూహిక పరిశుభ్రత డ్రైవ్‌లను నిర్వహించాలని కోరారు. కార్యక్రమాల వారీగా జీఎంసీ అధికారులకు, నోడల్ అధికారులకు విధులు కేటాయించాలన్నారు. నగరంలో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాల సమస్యల పరిష్కారం, పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరాల నిర్వహణ చేపట్టడం జరుగుతుందని వివరించారు. సమావేశంలో ఎస్ఈ ఎం.శ్యాం సుందర్, సిటీ ప్లానర్ డి.రాంబాబు, ఎంహెచ్ఓ మధుసూదన్, తూర్పు ఎంహెచ్ఓ(ఇన్‌చార్జి) రామారావు, మేనేజర్ ప్రసాద్, ఏడీహెచ్ రామారావు పాల్గొన్నారు.

# ఎరువుల ధరలకు రెక్కలు

- రైతుల నుంచి అదనంగా వసూలు
- ఆందోళనలో రైతులు



ఎరువుల షాపుల్లోని ఎరువుల బస్తాలు (ఫైల్)

చేబ్రోలు: అధికారుల పర్యవేక్షణ లోపం రైతులకు శాపంగా మారింది. చేబ్రోలు మండలంలో రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ ఎరువులను అధిక ధరలకు అన్నదాతలు ఎరువుల షాపుల్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొద్ది రోజులుగా చేబ్రోలులో డీఏపీని బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ప్రభుత్వం 50 కిలోల డీఏపీ బస్తా ధర రూ.1350లకు ప్రకటించగా ఎరువుల షాపుల్లో మాత్రం రూ.1450 నుంచి రూ.1500 వరకు విక్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వం ప్రకటించిన ధర కంటే రూ.100 నుంచి రూ.150 అధికంగా రైతులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. యూరియా బస్తా ధర రూ.267 ఉండగా ఎరువుల షాపుల్లో మాత్రం రూ.350 నుంచి 400లకు విక్రయిస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను పిచికారి చేయాల్సిన దశలో ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నప్పటికి సంబంధిత అధికారులు స్పందించికపోవటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామాల్లోనే రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ప్రభుత్వ ప్రకటించిన ధరకు అందజేశారు. ప్రస్తుతం గ్రామస్థాయిలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో లేకపోవటంతో అన్నదాతలు ఎరువుల షాపుల్లో వ్యాపారస్తులు చెప్పిన రేట్లకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు అధికారులకు తెలిసినప్పటికీ స్పందించకపోవటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

దీనిపై మండల వ్యవసాయశాఖాధికారి బి.శ్రీనివాస నాయక్‌ను వివరణ కోరగా రైతులు ఎరువులను అధిక ధరలకు కొనుగోలు చేయవద్దన్నారు. షాపుల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలని వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## అధ్వాన రోడ్లు.. ప్రజల పాట్లు



ఆలూరు రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న సిమెంటు రోడ్డు



డీవీసీ కాలనీలో నెర్రెలిచ్చి అధ్వానంగా ఉన్న సిమెంటు రోడ్డు

పొన్నూరు: పట్టణంలోని పలు వార్డుల్లో రోడ్లు అధ్వానంగా ఉండటంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిమెంటు రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో అవి కొంతకాలానికే పగుళ్లిచ్చి గుంతలమయంగా మారాయి. కొంతకాలంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో సమస్య తీవ్రంగా ఉన్నా మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో రాత్రి వేళల్లో ఆ రోడ్లలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిమెంటు రోడ్డులో నెర్రెలిచ్చిన గుంతల్లో పడి వాహనచోదకులు గాయాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి డీవీసీ కాలనీ, అంబేడ్కర్ నగర్‌లోని పార్క్ రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# మానవత సేవలు అభినందనీయం



ఎల్ఈడీ టీవీని అందిస్తున్న ఎమ్మెల్యే మాధవి

నగరంపాలెం: విద్య, వైద్య రంగంలో 'మానవత' సంస్థ చేపడుతున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బ్రాడీపేట 2/13లోని శ్రీ శారదాని కేతన్ విద్యా సంస్థకు శుక్రవారం డిజిటల్ తరగతుల సౌకర్యార్థం ఎల్ఈడీ టీవీని అందజేశారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ సంస్థ పక్షాన విద్య, వైద్య రంగాల్లో సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టడం ప్రశంసనీయమని అన్నారు. ఇటువంటి సంస్థలు సమాజానికి చాలా అవసరమని పేర్కొన్నారు. సంస్థ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడల్లో విద్యార్థులు రాణించాలని అన్నారు. కష్టపడి చదివితే భవిష్యత్ బంగారు బాట అవుతుందని చెప్పారు. చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ సంస్థ నుంచి సమాజానికి మెరుగైన సేవలు అందిస్తామని అన్నారు. టీవీ దాత అయిన వోలు బ్రహ్మయ్య, సుందరరామయ్య, సాయికిరణ్, గురువారెడ్డి, సుబ్రహ్మణ్యం ధనుంజయరెడ్డి, శివాజీ సాంబశివరావు, ఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# రేపు ఉపాధ్యాయులకు క్రీడా, సాంస్కృతిక పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉపాధ్యాయులకు క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం. హనుమంతరావు తెలిపారు. శుక్రవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ అరండల్‌పేట 10వ లైనులోని పిచ్చుకలగుంటలో ఆదివారం ఉదయం 9.00 గంటలకు క్రీడా పోటీలు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నక్కా వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ ప్రారంభిస్తారని తెలిపారు. సాంస్కృతిక పోటీలు బ్రాడీపేట 2/6లోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించబడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా సహాధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, యు. రాజశేఖరరావు, సబ్ కమిటీ సభ్యులు కె. ప్రేమ్‌కుమార్, కె. ప్రభూజీ, ఎండీ షకీలా బేగం, బి. ప్రసాద్, గోపయ్య, పీడీ అశోక్ పాల్గొన్నారు.

# 27న గుర్రం జాషువా జయంతి సభ

లక్ష్మీపురం: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి సభ ఈ నెల 27వ తేదీ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ప్రముఖ సాహితీ వేత్త, పుస్తక సమీక్షకులు గుమ్మా సాంబశివరావు మరియు 'పాడుదమా స్వేచ్ఛా గీతం' గీత రచయిత గంటేడ గౌరునాయుడులకు జాషువా సాహిత్య పురస్కారాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఈమని అప్పారావు, ఎం.ఎ. చిష్టీ, కిరణ్, బైరగాని శ్రీనివాసరావు, ఎస్.పద్మ, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.